‘పింఛన్ ఇప్పించండి మహాప్రభో’



ఎంపీడీవో కార్యాలయంలో గోడు చెప్పుకుంటున్న పింఛన్‌దారులు

నర్సాపూర్, మార్చి 27: పింఛన్ డబ్బులు ఇప్పించండి మహాప్రభో అంటూ పింఛన్‌దారులు నర్సాపూర్‌లోని ప్రభుత్వ కార్యాలయాలకు పోటెత్తారు. గురువారం మున్సిపాలిటీలో వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు తమకు ఫించన్ రావడం లేదని తరలివచ్చారు. తమకు పింఛన్ ఇప్పించాలని ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాలకు తిరుగుతున్నట్లు తెలిపారు. పింఛన్‌దారులు మాట్లాడుతూ మూడు రోజులుగా పోస్టాఫీస్ చుట్టూ తిరుగుతున్నామన్నారు. తమకు ఫించన్ ఇవ్వాలని కోరగా పండుగ తర్వాతనే పింఛన్ వస్తుందని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరిని అడగాలో తెలియక ఎంపీడీవో కార్యాలయానికి వచ్చినట్లు తెలిపారు. తమకు సంబంధం లేదని మున్సిపల్ కార్యాలయంలో అడగాలని వారు చెప్పగా, చేసేదేమీ లేక మున్సిపల్ కార్యాలయానికి వచ్చినట్లు వారు తెలిపారు. అక్కడి అధికారులను అడుగగా కమిషనర్ లేడని, బయట కూర్చోవాలని పంపించారని చెప్పారు. తమ గోడు ఎవరూ పట్టించుకోవడం లేదని, పింఛన్ రావడం లేదని, తమకు డబ్బులు ఇప్పించాలని పింఛన్‌దారులు గోడువెళ్లబోసుకున్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు కేటాయింపు

ఎంపీడీవో, కార్యదర్శిని వివరాలడుగుతున్న అధికారి

రామాయంపేట, మార్చి 27: అర్హులైన వారికే ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసిందని, లబ్ధిదారులు ఇండ్లను త్వరగా నిర్మించుకోవాలని జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ మాణిక్యం పేర్కొన్నారు. గురువారం రామాయంపేట మండలం దామరచెర్వుకు విచ్చేసిన పీడీ గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. లబ్ధిదారులను, రామాయంపేట ఎంపీడీవో, కార్యదర్శిని వివరాలడిగి తెలుసుకున్నారు. అనంతరం పీడీ మాట్లాడుతూ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను ప్రతిష్టాత్మకంగా తీసుకుని అర్హులైన వారికే మంజూరు చేసిందన్నారు. ప్రభుత్వం నుంచి మంజూరైన ప్రతిఒక్కరూ తమ ఇండ్లను నిర్మించుకోవాలన్నారు. ఇండ్ల బిల్లులు విడతల వారీగా వస్తాయని, ఆందోళనకు గురికావద్దన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో షాజుల్‌ుద్దీన్, గ్రామ కార్యదర్శి ఉన్నారు.

ఎంఈవోపై చర్యలు తీసుకోవాలి: ఎస్టీయూ, తపస్



డీఈవోకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

మెదక్ మున్సిపాలిటీ/చిన్నశంకరంపేట, మార్చి 27: పదో పరీక్షలకు విధులు కేటాయించనప్పటికీ కేంద్రాలకు వెళ్లిన ఎంఈవో పుష్పవేణిపై చర్యలు తీసుకోవాలని ఎస్టీయూ, తపస్ జిల్లా అధ్యక్షులు రాజగోపాల్‌గౌడ్, ఎల్లం, డీఈవో రాధాకిషన్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనధికారికంగా పరీక్షా కేంద్రాల్లోకి వెళ్లి చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ అధికారుల విధులకు ఆటంకం కలిగించారని ఆరోపించారు. ఈ నెల 26న గణిత పరీక్ష జరుగుతున్న సమయంలో మోడల్ స్కూల్, మిర్జాపల్లిలోని పరీక్షా కేంద్రాల్లోకి వెళ్లి విద్యార్థులు, ఇన్విజిలేటర్లను భయభ్రాంతులకు గురి చేశారన్నారు. విద్యార్థుల పరీక్షా సమయాన్ని వృథా చేశారని, వెంటనే ఎంఈవోపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరినట్లు పేర్కొన్నారు. వారి వెంట ఉపాధ్యాయ సంఘాల నేతలు లక్ష్మణ్ తదిరులు ఉన్నారు.

మెదక్ మున్సిపల్ చైర్మన్ ఎస్సీలకు కేటాయించాలి

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 27: మెదక్ మున్సిపల్ చైర్మన్ ఎస్సీలకు కేటాయించాలని దళిత ప్రజా సంఘాల ఐక్య కార్యచరణ సాయుధ పోరాట సమితి నాయకులు కోరారు. గురువారం ఐక్య కార్యచరణ సమితి నాయకులు బాలరాజు, శంకర్, లక్ష్మణ్, రవి, సుందరయ్య, గంగాధర్, గణేశ్ తదితరులు కలెక్టర్ రాహుల్ రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీ ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు ఎస్సీ రిజర్వేషన్‌కు నోచుకోలేదన్నారు. పట్టణంలో ఎస్సీ, ఎస్టీ ఉపకులాలు అధిక సంఖ్యలో ఉన్నా ఇంతవరకు రిజర్వేషన్ కల్పించలేదన్నారు. ఎస్సీ జనాభాను తక్కువగా చూపించడమేనని కారణమని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో మెదక్ మున్సిపల్ చైర్మన్ స్థానాన్ని ఎస్సీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

శిబిరాన్ని పరిశీలిస్తున్న విద్యాసాగర్

నర్సాపూర్, మార్చి 27: సామాజిక మాధ్యమాలు ఇతరేతర చెడు అలవాట్లతో కాలయాప న చేస్తూ యువత బంగారు భవిష్యత్తును పా డు చేసుకుంటున్నారని ఉస్మానియా విశ్వ విద్యాలయం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ విద్యాసాగర్ పేర్కొన్నారు. మండలంలోని రెడ్డిపల్లిలో నిర్వహిస్తున్న శీతాకాల ప్రత్యేక శిబిరాన్ని ఆయన సందర్శించారు. రెడ్‌క్రాస్ సొసైటీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర బ్లడ్ బ్యాంక్ నిర్వహణ కమిటీ అడ్వయిజర్ సింగం శ్రీనివాస్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, ప్రిన్సిపాల్ దామోదర్, ప్రోగ్రామ్ అధికారి సురేశ్‌కుమార్ పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాస్ హెల్ప్ డెస్కు ప్రారంభం

నిజాంపేట, మార్చి 27: నిజాంపేట ఎంపీపీ కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం హెల్ప్ డెస్కును ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో రాజిరెడ్డి తెలిపారు. మీసేవ లేదా ఆన్‌లైన్‌లో ఏప్రిల్ 5 వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఆదాయ, కుల సర్టిఫికెట్స్ జిరాక్స్‌లను ఫొటోతో జతచేసి ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలన్నారు.

రామాయంపేటలో..

రామాయంపేట, మార్చి 27: రామాయంపేట పట్టణంలోని మండల కార్యాలయంలో రాజీవ్ యువ వికాస్ హెల్ప్ డెస్కును ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీవో.షాజుల్‌ుద్దీన్ పేర్కొన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించడం కోసం ఈ పథకాన్ని తీసుకొచ్చిందని, యువత సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే నిండుప్రాణం బలి

సుధాకర్‌రెడ్డి (ఫైల్)

శివ్వంపేట, మార్చి 27: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ఓ నిండు ప్రాణం బలైందని చెన్నాపూర్‌లో గ్రామస్తులు గురువారం ధర్నా చేశారు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సింగిరెడ్డి సుధాకర్‌రెడ్డి (45) కొత్త ఇంటిని నిర్మించుకున్నాడు. నీటిని పట్టే క్రమంలో ఇంటికిపక్క నుంచే ఉన్న త్రిఫేజ్‌లైన్‌కు చేయి తాకడంతో విద్యుత్ షాక్ తగిలింది. దీంతో బిల్డింగ్‌పై నుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలిసిన బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కలసి ప్రధాన రహదారిపై ధర్నాకు దిగారు. కొన్ని రోజులుగా ఇండ్ల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలిగించాలని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా వినిపించుకోలేదని ఆరోపించారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే సుధాకర్‌రెడ్డి ప్రాణం పోయిందని నిరసన చేశారు. పోలీసులు చేరుకుని విద్యుత్ అధికారులతో మాట్లాడారు. వెంటనే ఇండ్ల మధ్య నుంచి ట్రాన్స్‌ఫార్మర్ తొలిగించి, తగిన న్యాయం చేస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు. మృతుడి భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రణాళికాబద్ధంగా ధాన్యం కొనుగోళ్లు

- వరి కోతల ప్రకారం సకాలంలో కొనుగోళ్లు ప్రారంభం
- తాలు లేకుండా శుభ్రపరిచిన ధాన్యాన్ని కేంద్రాలకు తరలించాలి
- గ్రేడ్ ఏ రకానికి రూ.2320, సాధారణ రకానికి రూ.2300
- కలెక్టర్ రాహుల్‌రాజ్
- ధాన్యం కొనుగోలుపై అధికారులతో సమీక్షించిన కలెక్టర్

మెదక్, మార్చి 27 (నమస్తే తెలంగాణ): యాసంగి ధాన్యం కొనుగోలుకు కేంద్రాలను ఏప్రిల్‌లో ప్రారంభించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా పౌర సరఫరా శాఖ ఆధ్వర్యంలో యాసంగి ధాన్యం కొనుగోలుపై అదనపు కలెక్టర్ నగేశ్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో తప్పనిసరిగా తాగు నీరు, విద్యుత్, టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, తూకం వేసే యంత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ధాన్యం తూకంలో పారదర్శకంగా ఉండాలని, నిర్దేశించిన విధంగా కొనుగోళ్లు చేయాలని సూచించారు. నిర్దేశించిన బరువుకంటే ఎక్కువ ఎట్టి పరిస్థితుల్లోనూ చేయవద్దని స్పష్టంచేశారు. తాము కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పా టు చేసే కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు. ప్రభుత్వం గ్రేడ్ ఏ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2320, సాధారణ రకానికి రూ.2300 నిర్ణయించినందన్నారు.

ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం

రబీ సీజన్ కోతలు మొదలవుతున్న దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 21 మండలాల్లో ఏప్రిల్ నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ధాన్యాన్ని సేకరించేందుకు 480 కేంద్రాలు ప్రారంభించనున్నట్లు వివరించారు. రైతులకు టోకెన్లు ఇవ్వాలని, దాని ప్రకారం కొనుగోళ్లు చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు చేసినప్పుడు రైతు ఐరిస్ కూడా తీసుకోవాలన్నారు. ఆయా శాఖల అధికారులు కొనుగోళ్లు నిత్యం పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లాలో అవసరం మేరకు అన్ని పరికరాలు అందుబాటులో ఉన్నాయని అదనపు కలెక్టర్ నగేశ్ వెల్లడించారు. టార్పాలిన్లు 14919, తూకం వేసే యంత్రాలు 700, ప్యాడీ క్లీనర్లు 500 తేమ శాతం చూసే మెషిన్లు 700 అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లాలోని రైతులు వీటిని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ మద్దతు ధరకే ధాన్యాన్ని విక్రయించాలని అదనపు కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి వినయ్, డీఎం సివిల్ సప్లై జగదీశ్ కుమార్, జిల్లా పౌరసరఫల అధికారి సురేశ్‌రెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి యాదయ్య, డీసీవో కరుణాకర్, లీగల్ మెట్రాలజీ అధికారి సుధాకర్, ఆర్డీవోలు మెదక్ రమాదేవి, తూప్రాన్ జయ చంద్రారెడ్డి, నర్సాపూర్ మహిపాల్‌రెడ్డి, ఐకేపీ, పీఏసీఎస్, మార్కెట్ కమిటీ చైర్మన్లు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్, రవాణా శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ చట్టాన్ని పక్కాగా అమలు చేయాలి

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు న్యాయం అందించేలా చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ స్పష్టంచేశారు. గురువారం షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. అట్రాసిటీ కేసుల నమోదు, పురోగతి, బాధితులకు చెల్లించాల్సిన పరిహారం, తదితర అంశాలపై కలెక్టర్ చర్చించారు. అట్రాసిటీ కేసులు, పరిష్కరించిన కేసులు, బాధితులకు అందిన పరిహారం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సివిల్ రైట్స్ డే అమలు చేస్తున్నామని, క్షేత్రస్థాయిలో కేసు పూర్వాపరాలు పరిశీలించి, బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ చట్టాల గురించి అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. సబ్ డివిజన్ స్థాయిలో విజిలెన్స్ మానిటరింగ్ సమావేశాలు జరుగాలన్నారు. ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అట్రాసిటీ కేసుల్లో శరవేగంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నగేశ్, ఆర్డీవోలు మెదక్ రమాదేవి, నర్సాపూర్ మహిపాల్‌రెడ్డి, తూప్రాన్ జయచంద్రారెడ్డి, షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి శశికళ, గిరిజన సంక్షేమ అధికారి నీలిమ, మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, విజిలెన్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

సెర్ప్ లక్ష్యాల సాధనకు చర్యలు

- పెండింగ్ కమీషన్ బకాయిలు ఐకేపీ కేంద్రాలకు చెల్లించేలా చర్యలు
- స్టిచ్చింగ్ కేంద్రాల ద్వారా ప్రైవేటు ఆర్డర్లు సైతం చేపట్టాలి
- నవంబర్ వరకు జిల్లా సమైక్య భవనాల నిర్మాణం పూర్తిచేయాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్
- సెర్ప్ కార్యక్రమాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష

మెదక్, మార్చి 27 (నమస్తే తెలంగాణ): సెర్ప్ సంస్థ నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్ తెలిపారు. గురువారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి, సెర్ప్ కార్యక్రమాలపై సెర్ప్ సీఈవో డీ.దివ్యతో కలిసి కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. మెదక్ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేశ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగి సీజన్‌లో సెర్ప్ ద్వారా ఏర్పాటు చేయబోయే ఐకేపీ కొనుగోలు కేంద్రాల సంఖ్య పెంచాలని సీఎం నిర్ణయించారన్నారు. ప్రస్తుతం 33 శాతం ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు 50 శాతానికి పెంచేలా ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. జిల్లాలో ఇతర శాఖలు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేని పక్షంలో వాటిని ఐకేపీలకు బదిలీ చేయాలని, అదనపు ధాన్యం దిగుబడి నేపథ్యంలో నూతన కేంద్రాల ఏర్పాటు సైతం స్వశక్తి మహిళా సంఘాలతో ప్రారంభించాలని తెలిపారు. దివ్యాంగులకు యూడీఐడీ కార్డుల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. కలెక్టర్ ప్రత్యేకంగా సమీక్షించి దివ్యాంగులకు నిర్ధారణ పరీక్షల నిర్వహణకు స్లాట్ బుకింగ్ ప్రక్రియ ప్రారంభించాలన్నారు. మహిళా సంఘాల ద్వారా పెట్రోల్ బంకులు ఏర్పాటు చేయాలని, బంకుల ఏర్పాటుకు అనువైన భూములు గుర్తించాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 127 ఐకేపీ కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగులను నిర్ధారించేందుకు అవసరమైన పరికరాలు దవాఖానల్లో ఏర్పాటుకు సహకారం అందించాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీవో శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్ట్‌లు

రామాయంపేట: మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేసిన పోలీసులు

మెదక్ రూరల్: పోలీసుల అదుపులో బీఆర్ఎస్ మాజీ సర్పంచ్‌లు

చిన్నశంకరంపేట పోలీస్‌స్టేషన్‌లో పోలీసుల అదుపులో మాజీ సర్పంచ్‌లు

నిజాంపేట పోలీస్‌స్టేషన్‌లో ముందస్తుగా అరెస్టైన మాజీ సర్పంచ్‌లు

చిలిపిచెడ్ పోలీస్ స్టేషన్‌లో తాజా బీఆర్ఎస్ మాజీ సర్పంచులను అరెస్టు చేసిన పోలీసులు

రామాయంపేట/నిజాంపేట/మెదక్‌రూరల్/చిన్నశంకరంపేట/చిలిపిచెడ్, మార్చి 27: పెండింగ్ బిల్లుల కోసం మాజీ సర్పంచులు హైదరాబాద్‌లోని అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న వారిని ముందస్తుగా పోలీసులు గురువారం అరెస్టు చేశారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో పోలీసులు గురువారం తెల్ల వారు జామున బీఆర్ఎస్ మాజీ సర్పంచ్‌ల ఇండ్లకు వెళ్లి అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము గ్రామాల అభివృద్ధికి పనులు చేసి, లక్షలు ఖర్చు చేసుకున్నామన్నారు. ప్రభుత్వం తమకు బిల్లులు ఇవ్వడంలో చిన్న చూపు చూడడం తగదన్నారు. పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు, బకాయిలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మెదక్ రూరల్ పోలీసులు అరెస్టుచేసిన వారిలో సిద్ధాగౌడ్, ప్రభాకర్, మోహన్‌నాయక్, ఎలక్షన్‌రెడ్డి ఉన్నారు. నిజాంపేటలో మాజీ సర్పంచ్‌లు వెంకటాపూర్(కె), జడ్చెరువుతండా, నిజాంపేటకు చెందిన అనిల్‌కుమార్, అరుణ్‌కుమార్, నర్సింహులు ఉన్నారు. రామాయంపేటలో సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు నర్సాగౌడ్, మాజీ సర్పంచ్‌లు ఉన్నారు. చిలిపిచెడ్ పోలీస్‌స్టేషన్‌లో మాజీ సర్పంచులు గోపాల్‌రెడ్డి, శంకర్‌నాయక్, యాదగిరి, నర్సింహారెడ్డి ఉన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి: సీఐటీయూ

మాట్లాడుతున్న ఉపాధ్యక్షురాలు బాలమణి

రామాయంపేట, మార్చి 27: ఏప్రిల్ 2, 3 తేదీల్లో నిర్వహించనున్న సీఐటీయూ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలు బాలమణి అన్నారు. గురువారం నిజాంపేట, రామాయంపేట మండలాల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న వైఖరిని ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

పిట్టల వాడకు కనీస వసతులు కల్పించాలి

ఆర్.వెంకటాపూర్ గ్రామ శివారులోని పిట్టల బస్తీవాసులకు కనీస వసతులు కల్పించాలని సీఐటీయూ ఉపాధ్యక్షురాలు బాలమణి డిమాండ్ చేశారు. గురువారం పిట్టల బస్తీని సందర్శించి, వారి జీవన స్థితిగతులను తెలుసుకున్నారు. మూడు దశాబ్దాలుగా 26 కుటుంబాలు కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.

ఉరేసుకుని వ్యక్తి మృతి

మనోహరాబాద్, మార్చి 27: మద్యానికి బానిసై, జీవితంపై విరక్తి చెంది ఉరేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. మనోహరాబాద్ ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కాళ్లకల్‌కు చెందిన కమలేశ్ యాదవ్(27)కు అదే గ్రామానికి చెందిన మమతతో ఐదేండ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి మూడేళ్ల లోపు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కమలేశ్ వెల్డింగ్ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ప్రతి రోజు పూటుగా మద్యం సేవించి ఇంటికి వచ్చేవాడు. ఈ క్రమంలో ఈ నెల 26న రాత్రి తాగి ఇంటికి వచ్చాడు. ఇంకొంచెం తాగి వస్తానని చెప్పి మళ్లీ బయటకు వెళ్లిపోయాడు. ఎంతకీ ఇంటికి రాలేదు. మరునాడు ఉదయం చుట్టు పక్కల వెతుకుతుండగా, కాళ్లకల్ శివారులోని శ్మశాన వాటిక పక్కన ఉన్న ఓ చెట్టుకు చున్నీతో ఉరేసుకుని మృతి చెందాడు. కిందికి దించి చూడగా అప్పటికే కమలేశ్ మృతి చెంది ఉన్నాడు. కమలేశ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ దవాఖానా మార్చురీకి తరలించారు. మృతుడి భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

చిన్నశంకరంపేట, మార్చి 27: తహసీల్ కార్యాలయానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చడం కోసం తహసీల్దార్ మన్నన్ గురువారం చలివేంద్రాన్ని ప్రారంభించారు.

నేడు ఇసుక బహిరంగ వేలం

రామాయంపేట, మార్చి 27: నేడు రెవెన్యూ కార్యాలయం వద్ద ఇసుక డంపును వేలం వేయనున్నట్లు తహసీల్దార్ రజినీకుమారి అన్నారు. గురువారం తన కార్యాలయంలో మాట్లాడుతూ రామాయంపేటలో మూడు రోజుల క్రితం పట్టుబడ్డ ఇసుక డంపులను శుక్రవారం వేలం వేస్తున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనేవారు ముందుగా రూ.5వేలు చెల్లించాలన్నారు.

వెల్దుర్తిలో ఇసుక డంపు వేలం

వెల్దుర్తి, మార్చి 27: ఇసుక డంపులను ఏప్రిల్ 3న వేలం వేయనున్నట్లు తహసీల్దార్ కృష్ణ గురువారం ప్రకటనలో తెలిపారు. వెల్దుర్తి శివారు హల్దీవాగు ఒడ్డున రైస్‌మిల్ వెనుక పానాది రోడ్డు పక్కన ఉన్న రెండు డంపులు 13 ట్రాక్టర్ల ఇసుక, తహసీల్ కార్యాలయం వద్ద ఉన్న నాలుగు ట్రాక్టర్ల ఇసుక మొత్తం 17 ట్రాక్టర్ల ఇసుకను వేలం వేయనున్నామని పేర్కొన్నారు. వెల్దుర్తి మండలంలోని ప్రజలు వేలంలో పాల్గొనాలని తహసీల్దార్ తెలిపారు.

గురుపీఠానికి విరాళాలు ఇవ్వండి

శివ్వంపేట, మార్చి 27: మండలంలోని గూడురులో విశ్వయోగి విశ్వంజి మహారాజ్ గారి దివ్య ఆశీస్సులతో నిర్మిస్తున్న దత్తాత్రేయ మహాస్వామి ఆలయం, ఆదివృక్షాల సహిత పంచవటి షిర్డీ సాయినాథ మందిరానికి విరాళాలివ్వాలని గురుపీఠం చైర్మన్ జిన్నారం శివకుమార్‌గౌడ్ కోరారు. ఆలయాల నిర్మాణం 80 శాతం పనులు పూర్తి చేశామని, దాతలు విరాళాలు ఇస్తే నిర్మాణాన్ని పూర్తిచేస్తామని తెలిపారు. ఖాతా పేరు శ్రీగురుపీఠం, ఇండియన్ బ్యాంకు ఖాతా నం. 7641774226, లేదా ట్రస్టు చైర్మన్ 9849039272, 9100939272 నంబర్లను సంప్రదించాలని కోరారు.

బాలసదనంలో జడ్జి తనిఖీ

మెదక్ అర్బన్, మార్చి 27: జిల్లా కేంద్రంలోని స్టేడియం దగ్గర ఉన్న బాలసదనాన్ని సీనియర్ సివిల్ న్యాయమూర్తి జితేందర్ తనిఖీ చేశారు. బాలసదనంలో ఉన్న పిల్లల చదువు, ఆరోగ్యం, వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు.

నేడు సొసైటీ వార్షిక సభ

వెల్దుర్తి, మార్చి 27: నేడు వెల్దుర్తి ప్రాథమిక సహకార సంఘం వార్షిక మహాజన సభను నిర్వహిస్తున్నట్లు సీఈవో సిద్దయ్య గురువారం ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు సహకార సంఘ భవనంలో ఈ సమావేశంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సంఘం సభ్యులు అందరూ హాజరుకావాలని కోరారు.

ఆస్తి పన్ను వడ్డీపై 90 శాతం రాయితీ

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 27: మున్సిపల్ పరిధిలోని ఆస్తి పన్ను వడ్డీపై వన్‌టైం సెటిల్‌మెంట్ కింద రాష్ట్ర ప్రభుత్వం ఆస్తిపన్ను బకాయిలపై వడ్డీ 90 శాతం రాయితీ కల్పించిందని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గురువారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 31లోపు ఆస్తి పన్ను, వడ్డీతో సహా ఒకేసారి చెల్లిస్తే ఈ రాయితీ వర్తిస్తుందన్నారు.

మెదక్ బార్‌అసోసియేషన్ అధ్యక్షుడిగా రాములు



మెదక్ అర్బన్, మార్చి 27: మెదక్ బార్ అసోసియేషన్ ఎన్నికల్లో మార్కంటి రాములు విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి శిర గ ప్రభాకర్ తెలిపారు. గురువారం మెదక్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మార్కం టి రాములు 12 ఓట్ల మెజార్టీతో షేక్ ఫజల్ ఆహ్మద్‌పై విజయం సాధించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

HOUSE FOR SALE

★రుద్రారం ముంబై హైవే ఫేసింగ్ విల్లాలు, HMDA, RERA, Bank Loans, స్విమ్మింగ్ పూల్, క్లబ్‌హౌస్ అద్భుతమైన వెంచర్‌లో అమ్మకానికి కలవు. 9912759000.
NT-331083

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

01-04-2025, 00:00 గం.ల నుండి మనోహరబాద్ టోల్ ప్లాజా (కి.మీ.481+331) వద్ద వర్తించు సవరించిన యూజర్ ఫీజు (టోల్) కు సంబంధించి బహిరంగ ప్రకటన

1. ఇందుమూలముగా సాధారణ ప్రజానికానికి తెలియజేయునది ఏమనగా గెజిట్ నోటిఫికేష